ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024 | 3





అంబాజీపేటలో నాఫెడ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

కొబ్బరి రైతులకు అండగా ఉంటాం

కొబ్బరికాయల కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం: ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

అంబాజీపేట, జూలై 8: కోనసీమ కొబ్బరి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్, నాఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అంబాజీపేట మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ మాట్లాడుతూ కోనసీమలో కొబ్బరి అపారంగా ఉందని, కొబ్బరిపై ఆధారపడి జీవించే వారు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారన్నారు. కొబ్బరికి సరైన డిమాండ్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. తన తండ్రి, లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి హయాంలో కోనసీమలో మొదటిసారిగా నాఫెడ్ కేంద్రాలను ప్రారంభించి కొబ్బరి రైతులను ఆదుకున్నామన్నారు. అప్పటి నుంచీ ప్రతిఏటా ఈ కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద కొబ్బరిని కొనుగోలు చేస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్ ధరకు, నాఫెడ్ ధరకు రూ.3వేలు వ్యత్యాసం ఉందని... నాఫెడ్‌లో కొబ్బరిని విక్రయిస్తే రైతులకు కొంతమేర లాభం ఉండవచ్చన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు కొబ్బరికాయలను కొనుగోలు చేసేలా కృషి చేస్తామని చెప్పారు. కొబ్బరిలో అంతర పంటగా కోకోను సాగు చేస్తున్నప్పటికీ దానికి సరైన మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోకో రైతులు ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొబ్బరి, వరి కొనుగోలు కేంద్రాల మాదిరిగా కోనసీమలో కోకో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి కోకో రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని ఎంపీ హరీష్ హామీ ఇచ్చారు. కొబ్బరిని ఆశించిన తెల్ల దోమ, తెగుళ్ల కారణంగా కొబ్బరి దిగుబడులు గణనీయంగా తగ్గాయని, ఈ ప్రాంత రైతులను ఆదుకునేందుకు వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ వెనిగర్, పౌడర్, చిక్స తదితర ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధులు ఎంపీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సీనియర్ మేనేజరు యు.సుధకరరావు, కృషీవల చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి బీవీ రమణ, దాసరి వీర వెంకట సత్యనారయణ, బొంతు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

కలెక్టర్ మహేష్‌కుమార్... ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 180 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, జూలై 8: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధికార యంత్రాంగం ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ సూచించారు. మొక్కుబడి పరిష్కారాలను ఆమోదించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి సమగ్ర పరిష్కారాలు అందించాలన్నారు. ఒకసారి చేసిన అర్జీ మళ్లీ ఓపెన్ కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులదేనని స్పష్టం చేశారు. వ్యక్తిగత, సామాజిక ఫిర్యాదులు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వ్యక్తిగత, సామాజిక సమస్యలకు పరిష్కారాలు కోరుతూ అందజేసిన 180 అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు స్వీకరించారు. కలెక్టర్ హోదాలో మహేష్‌కుమార్ అందరికంటే ముందు హాజరయ్యారు. పౌరుల ఫిర్యాదులను కేంద్రీకృత విధానంలో సేకరించి నాణ్యతగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సీపీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు కల్పించండి

మెట్ల రామలక్ష్మి కాలనీ మహిళలు, జనుపల్లి

రెండున్నర దశాబ్దాల క్రితం మెట్ల రామలక్ష్మి కాలనీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా మాకు మౌలిక సదుపాయాలు కల్పించట్లేదు. రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పించడంతో పాటు తాగునీరు అందించాలి. కాలనీలో కొద్దిపాటి వర్షానికే నడిచే దారి కూడా లేదు. మా ఇబ్బందులను గుర్తించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.

ఎస్పీ కార్యాలయంలో 12 అర్జీలు

అమలాపురం టౌన్, జూలై 8: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఎస్పీ ఎస్.శ్రీధర్ పన్నెండు అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సివిల్ వివాదాలకు సంబంధించి నాలుగు, కుటుంబ కలహాలు మూడు, ఇతర సమస్యలపై ఐదు అర్జీలు అందాయి. చట్ట పరిధిలో సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. సత్వర న్యాయం అందించాలన్నారు.



ఈదరపల్లిలోని నిర్మాణం పూర్తి కాని అగ్రి ల్యాబ్

సిబ్బంది కొరత... పరికరాల లేమి!

అందుబాటులోకి రాని అగ్రి ల్యాబ్‌లు

అమలాపురం రూరల్, జూలై 8: రైతు సంక్షేమమే తమ లక్ష్యమని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అగ్రి ల్యాబ్ నిర్మించి రైతులకు అండగా ఉంటామంది. కోనసీమ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్ భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.మూడు నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్‌ల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే అక్కడ ప్రయోగాలు చేసేందుకు సిబ్బంది కొరతతో పాటు సంబంధిత పరికరాలు అందుబాటులో లేకుండా పోయాయి. మూడేళ్లుగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఈదరపల్లిలోను, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పోతవరంలోను నిర్మాణం ప్రారంభించిన అగ్రి ల్యాబ్‌లు ఎప్పటికీ అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అగ్రి ల్యాబ్‌లను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అందుబాటులోకి తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అగ్రి ల్యాబ్‌ల నిర్మాణంతో పాటు ప్రయోగశాలల్లో అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడంతో పాటు ప్రయోగాలకు అవసరమైన కిట్‌లను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

రైతుల కోసమంటూ సచివాలయాల వారీగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు నేటికీ పూర్తిగా సేవలు అందించలేని పరిస్థితిలో ఉన్నాయి. వ్యవసాయ, ఆక్వాకల్చర్, పశువ్యాధి నిర్ధారణలకై నియోజకవర్గానికి ఒక సమీకృత వ్యవసాయ ప్రయోగశాల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. ఈదరపల్లిలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ రూ.82 లక్షల అంచనా వ్యయంతో అగ్రి ల్యాబ్ నిర్మాణానికి 2021 ప్రారంభంలోనే శంకుస్థాపన చేశారు. మూడేళ్లు పూర్తి అయినా భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పోతవరంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ముమ్మిడివరం, ద్రాక్షారామ (రామచంద్రపురం), రావులపాలెం (కొత్తపేట) అగ్రి ల్యాబ్‌లు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆయా విభాగాలకు సంబంధించి సిబ్బంది కొరతతో పాటు ప్రయోగాలకు అవసరమైన కిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రాలేకపోయారు.

ప్రతి అగ్రి ల్యాబ్‌లోనూ ఒక ఆక్వాకల్చర్ ప్రయోగశాల ఉంటుంది. ఇక్కడ ఆక్వా చెరువులకు సంబంధించి మట్టి, నీరు, మైక్రో బయాలజీ, రొయ్యలు, చేపల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అందుకు తగ్గ పరికరాలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను ఇక్కడ పరిశీలిస్తారు. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికే అనుకున్న లక్ష్యం మేరకు విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలను పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. ఇక మూడోదిగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కూడా ఇక్కడే ఉంటుంది. అగ్రిల్యాబ్‌లో వ్యవసాయానికి సంబంధించి ఒక ఏవోతో పాటు ఇద్దరు ఏఈవోలు ఉండాలి. విత్తనాలు, ఎరువులు నాణ్యత పరీక్షించుకునేందుకు ఈ ప్రయోగశాల దోహదపడుతుంది. ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తే రైతులు పరీక్షలకు నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదని జేడీ తెలిపారు. ప్రైవేటు విత్తన డీలర్లు మాత్రం ఒక్కో పరీక్షకు రూ.300 నుంచి రూ.2,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈదరపల్లిలోని అగ్రి ల్యాబ్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, విద్యుత్ సౌకర్యం కల్పించామని, ల్యాబ్‌కు అవసరమైన పరికరాలు, యంత్రాలు ఇతర సామగ్రి రావాల్సి ఉందన్నారు. పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు ల్యాబ్ అటెండ్‌ను నియమించాల్సి ఉందని సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి తెలిపారు. ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఈదరపల్లి ల్యాబ్ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా అగ్రి ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



సహకార సంఘాల సిబ్బంది అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సమన్వయ అధికారి శ్రీనివాస్

విద్యుత్ బిల్లు నుంచి.. విమాన టిక్కెట్ వరకు

ఆన్‌లైన్‌లోనే డిజిటల్ సేవలు

అమలాపురం టౌన్, జూలై 8: విద్యుత్ బిల్లుల నుంచి విమాన టిక్కెట్ల వరకు అన్నీ సహకార సంఘాల్లోని డిజిటల్ సేవల్లో అందుబాటులో ఉండబోతున్నాయని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ రాష్ట్ర సమన్వయ అధికారి డాక్టర్ ఎస్ఎల్ఎస్వీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అమలాపురం రోటరీ కల్యాణ మండపంలో సోమవారం జిల్లాలోని సహకార సంఘాల సిబ్బందికి రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘాల్లో అన్ని రకాల డిజిటల్ సేవలను కామన్ సర్వీసెస్ సెంటర్ పోర్టల్‌లోకి తీసుకొచ్చామన్నారు. విద్యుత్ బిల్లులు, ఫోన్ బిల్లులు, పాన్ కార్డులు, రైల్వే టిక్కెట్లు సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 300 రకాల సేవలు పౌరులకు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయన్నారు. సహకార సంఘాల్లోని 60 మంది ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, డేటా ఆపరేటర్లు శిక్షణలో పాల్గొన్నారు. సిబ్బంది అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. జిల్లా రిజిస్ట్రార్ రాధాకృష్ణ, రాజారత్నం, బాపూజీ, రమేష్ తదితరులు పలు అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ రాష్ట్ర సమన్వయ అధికారి డాక్టర్ ఎస్ఎల్ఎస్వీ శ్రీనివాస్ సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో భాగంగా ఈ-గవర్నెన్స్ డిజిటల్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సహకార సంఘాల్లో వనరులను సమీకరించి పౌరులకు సులభతరంగా సేవలు అందిస్తామని చెప్పారు. ఆయన వెంట జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ వున్నారు.

పరిశ్రమల ద్వారా వెలువడే హానికర వ్యర్థాలపై

సమగ్ర నివేదిక ఇవ్వాలి

అమలాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిశ్రమల ద్వారా వెలువడే హానికర వ్యర్థాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదేశించారు. హానికర వ్యర్థాల నుంచి పర్యావరణ కలుషితం, కార్మికులకు శ్వాసకోశ సంబంధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందా అన్న దిశగా చర్యలు చేపట్టేలా నివేదిక ఉండాలన్నారు. జిల్లాలోని ఎరువులు, ఆక్వారంగ పరిశ్రమలు, కొబ్బరి ఆధారిత ఫైబర్ పరిశ్రమలు, ఉత్పాదక యూనిట్లను సందర్శించి మూడు వారాల్లోపు నివేదిక సమర్పించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పరిశ్రమల కేంద్రం, కాలుష్య నియంత్రణ మండలి, లీడ్ బ్యాంకు మేనేజరు, జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ, కార్మిక శాఖ సహాయ కమిషనరు, అగ్నిమాపక, ప్రావిడెంట్ ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల నుంచి వెలువడే హానికర వ్యర్థాలు, ఈపీఎఫ్ వర్తింపు వంటి స్థితిగతులు సమగ్రంగా ఉండాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం, హానికర వ్యర్థాల నుంచి రక్షణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పరిశ్రమల్లో సెక్యూరిటీ విధానాలు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది గుర్తించాలన్నారు. మండపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న వంద బాయిలర్ రైసుమిల్లులపై కూడా నివేదిక అందించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరుపీకేపీ ప్రసాద్, ఏడీ శివరామ్‌ప్రసాద్, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ రాధాకృష్ణ, కాలుష్య నియంత్రణా మండలి అధికారి ప్రణీత, లీడ్ బ్యాంకు మేనేజరు వర్మ, కార్మిక శాఖ సహాయ కమిషనరు పి.నాగలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలి

గోదావరి వరదల నివారణ కోసం శాశ్వత ప్రాతిపదికన ఏటిగట్ల రక్షణ, పటిష్టతకు కృషి చేయాలని జలవనరుల శాఖ ఇంజనీర్లను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జలవనరులు, డ్రైనేజీ విభాగం ఇంజనీర్లతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గోదావరి ఏటిగట్లు, డెల్టా ఆయకట్టు విస్తీర్ణం, కాల్వలు, డ్రైనేజీల విస్తీర్ణం, పూడికతీత పనులు తదితర అంశాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన నిధుల ద్వారా కాల్వలు, డ్రైనేజీల్లోని పూడికతీత పనులు శరవేగంగా చేపట్టి ప్రజలకు ముంపు బెడద లేకుండా పంటలు ముంపు బారిన పడకుండా రక్షించాలని ఆదేశించారు. కె.గంగవరం మండలం సుందరపల్లి-కూళ్ల, రాజోలు ప్రాంతాల్లో ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గండ్లు పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సముద్రపు ముఖద్వారాల వద్ద కూడా డ్రెడ్జింగ్‌కు చర్యలు తీసుకుంటూ పంటలు ముంపు బారిన పడకుండా చూడాలన్నారు. జలవనరుల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డివిజనల్ ఇంజనీర్లు నాగార్జున, శ్రీనివాసరావు, డ్రైనేజీ విభాగం డివిజనల్ ఇంజనీర్ ఎంపీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో బీజేపీ శ్రేణుల సందడి

బీజేపీ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం జరిగింది. క్షేత్ర స్థాయి నుంచీ పార్టీని బలోపేతంచేసే విషయమై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రులతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.... 5లో



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఇతర నేతలు



జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే నల్లమిల్లి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా

- రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పటిష్టతకు ప్రణాళిక
- సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచన
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 8 : బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగింది. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేసే విషయంపై కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి ఘన విజయం సాధించిన తర్వాత రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు ఎల్ మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర సమాచారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఆంధ్రరాష్ట్రంలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్ రాక్షస, నియంతృత్వ, అవినీతి, అరాచకపాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్య మయ్యాయన్నారు. ప్రతీ శాఖను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేశారని ఈ ఆర్థిక విధ్వంసం పూడ్చాలంటే దశాబ్దాలు పట్టేటట్టు ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయంతో వచ్చిన బాధ్యతను బీజేపీ కేడర్ అంతా గుర్తుంచుకోవాలని... ప్రజాసంక్షేమ పాలన, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పాలన, అవినీతిరహిత పాలన అందిస్తేనే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని గమనించాలని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఏపీలో గెలుపొందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను పేరు పేరునా అభినందించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి, సుజనాచౌదరి, పీవీ పార్థసారథి, ఎన్.ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, నాయకులు మధుకర్, జీవీఎల్ నరసింహరావు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, శివప్రకాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాశీ విశ్వనాథరాజు, లంక దినకర్, పాతూరి నాగభూషణం, వేటుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, రొంగల గోపి, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి మురుగన్‌ను సత్కరించిన పురందేశ్వరి

చక్కటి సమన్వయంతో కూటమి విజయం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల చక్కటి సమన్వయంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరుణ్‌సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్ వంటి పెద్దలు ఈ విషయంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి సమన్వయం పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఎఎస్ చట్టాలను, వాటిని భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం పేరుతో సత్వరమే అమలయ్యే చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల తరపున బీజేపీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ స్వాగతిస్తూ ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో

బీజేపీ శ్రేణుల సందడి

రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన బీజేపీ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు, కేడర్‌తో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం కావడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కమలం శ్రేణులు తరలివచ్చాయి. బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పలువురు ఈ సమావేశానికి హాజరుకావడం, వారితోపాటు వారి అనుచరగణం కూడా కార్లు, ఇతర వాహనాల్లో తరలి రావడంతో రాజమహేంద్రవరంలోని పలు ప్రధాన రోడ్లపై హడావుడి కనిపించింది. సెంట్రల్ జైలు రోడ్డులోని ఓ హోటల్‌లో ఈ సమావేశం నిర్వహించారు. దీంతో ఈ రోడ్డు మార్గంలో వాహనాలు బారులు తీరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం జరిగింది. సుమారు 2,500 మంది ఈ సమావేశానికి హాజరయ్యారని నాయకులు వెల్లడించారు. ఈ మార్గంలో దారిపొడవునా బీజేపీ జెండాలు కట్టారు. పలు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. మరోపక్క సమావేశం ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఆయా జిల్లాల నుంచి వచ్చిన వారి పేర్ల రిజిస్ట్రేషన్‌కు, ఇతర సమాచారం కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు.

గంజాయి విక్రేత అరెస్టు

యానాం, జూలై 8: యానాం నియోజకవర్గ పరిధిలోకి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న స్థానిక కురసాంపేటకు చెందిన బల్లా జోజీ (22)ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మురుగనందం తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు రూ.20 వేలు విలువ చేసే 40 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు అలవాటు పడిన జోజి తరుచూ ఉప్పాడ వద్ద ఓ గుడి సమీపంలో గంజాయిని తెచ్చి యానాం, పరిసర ప్రాంతాలలో ఎక్కువ రేట్లకు విక్రయిస్తుండగా యానాంలో హైస్కూల్ రోడ్డులో క్రైం సిబ్బంది పట్టుకున్నారన్నారు. గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు జోజిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

తుని పట్టణంలో భారీ చోరీ

తాళం పగలగొట్టి రూ.8.5 లక్షల విలువైన బంగారం అపహరణ

తుని రూరల్, జూలై 8: తుని కంకిపాటి వారి గరువు వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది.తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం తుని పట్నం కంకిపాటు వారి గరువుకు చెందిన కల్యాణం సత్యమణికుమార్ ఇల్లుకి తాళం వేసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోప్రవేశించి చోరీకి పాల్పడినట్లు వివరించారు.ఈచోరీలో రూ.8.5లక్షల విలువైన బంగారుఆభరణాలు, వెండి దొంగలించబడ్డాయని బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

పౌర హక్కుల పరిరక్షణకు శిక్షణ తరగతులు దోహదం

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల

కాకినాడలో ప్రారంభమైన ఏఐఎస్‌ఎఫ్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

కాకినాడ సిటీ, జూలై 8: రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఏఐఎస్‌ఎఫ్ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఆ దిశగా పయనించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను సోమవారం ముప్పాళ్ల ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన రాజ్యాంగంలో హక్కులు, సమాచార హక్కు చట్టం అనే అంశంపై ప్రసంగిస్తూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి నూతన విద్యా విధానం-విద్యార్థులపై దాని ప్రభావం అనే అంశంపై మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని అడ్డుకుందామన్నారు. ఈ విధానం వల్ల దేశంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయన్నారు. రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఈ పదేళ్లలో కనీసం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మూడోసారి అధికారంలోకి ఇతర మార్గాల్లో వచ్చారన్నారు. ప్రొఫెసర్ సీహెచ్ రాంబాబు నేటి సమాజ పరిణామ క్రమం అనే అంశంపై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులకు అధ్యక్ష వర్గంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, కావ్య నాగభూషణ్, కుక్లై స్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తాటిపాక మధు, రైతు సంఘం నాయకుడు కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు నక్కా శ్రీనివాసరావు, వి.కొండలరావు, పి.సత్యనారాయణ, ఎం.స్టాలిన్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావుచౌదరి



అభినందిస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



సుబ్బారావుచౌదరి

మండపేట, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.గంగవరం మండలం యండగండి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీరవెంకట సత్యసుబ్బారావుచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, కార్యదర్శిగా ఎస్.సత్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చౌదరి 30 ఏళ్లుగా రైస్‌మిల్లు నిర్వహణలో ఉన్నారు. ప్రస్తుతం కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు పరిధిలో శ్రీకృష్ణ కిరీటి ఫుడ్ ప్రొడక్ట్స్‌కు మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నారు. చౌదరి పెదనాన్న చుండ్రు సూర్య వెంకట సత్యనారాయణమూర్తి గతంలో ఆలమూరు తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 33 ఏళ్లు ఏకగ్రీవంగా పనిచేశారు. నూతన అధ్యక్షుడు చౌదరిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఇప్పటివరకు కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన వేగుళ్ల పట్టాభి అభినందించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు నెక్కంటి శ్రీరామ్‌జీ, గుణ్ణం చరణ్, ఈశ్వరరెడ్డి, కొనగళ్ల సత్యనారాయణ, వంక అన్నవరం, ఐ.ఎస్.ఎన్.చంటిబాబు, వైట్ల దుర్గారావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతబాబు దారుణాలపై సీఎంకు 'ముప్పాళ్ల' ఫిర్యాదు

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అనంతబాబు దళితుడైన తన డ్రైవరును అత్యంత పాశవికంగా హతమార్చి మృతదేహాన్ని ఇంటికి పార్శిల్ చేసిన కేసులో త్వరగా కఠిన చర్యలు తీసుకొనేలా చూడాలని కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఈ మెయిల్ ద్వారా విన్నవించినట్టు ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను పంపించామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, జూలై 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలోని ఎం.రామారెడ్డి ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచడంతో పౌరసరఫరాలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో పలు ఇళ్ల వద్ద నుంచి పీడీఎస్ బియ్యం రామారెడ్డి కొనుగోలు చేసి పాత ఇంట్లో 41 బస్తాల్లో 2,411 కిలోల బియ్యాన్ని నిల్వ ఉంచారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.09 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై 7(1) కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఎస్‌వో షేక్ అహ్మద్ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ తాడి జగన్నాథరెడ్డి, ఏవో జె.భార్గవ, మహేష్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధుడి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, జూలై 8: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఆర్‌ఆర్‌బీ చెరువులో పడి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన తటవర్తి వేమన్నదొర(68) ఆదివారం సాయంత్రం గేదెలు తోలుకుని ఆర్‌ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చిన ఒక గేదె కనబడకపోవడంతో మరలా చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఇతను చెరువులో పడి గల్లంతయినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం, జూలై 8: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 సంవత్సరాల నుంచి 30 లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 93983 38105 నంబరులో సంప్రదించాలన్నారు.

రూ.500 కోట్లు మింగేసిన జగన్ సర్కార్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



భూమిపూజ చేస్తున్న సత్యకుమార్‌యాదవ్

అనపర్తి, జూలై 8: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా అందించిన రూ.500 కోట్ల నిధులను వైసీపీ పాలనలో పేదలకు చేరకుండా మింగేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. అనపర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా మార్పు చేసే క్రమంలో రూ.13.85 కోట్ల నిధులతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, ఎమ్మెల్సీ రామారావుతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అనారోగ్య ప్రదేశ్‌గా మార్చిందని, కనీసం సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేదన్నారు. మాజీ సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆసుపత్రులకు సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆస్పత్రిలోను మౌలిక సదుపాయాలు కల్పించి ఆంధ్ర ప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, జనసేన నాయకులు, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు అధికారులపై చంద్ర దండు వలంటీర్ ఫిర్యాదు

అనపర్తి, జూలై 8: గత ఏడాది ఫిబ్రవరిలో అనపర్తిలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి బహిరంగ సభలో తమపై పోలీసులు భౌతిక దాడులు చేశారని వారిపై చర్యలు చేపట్టాలని సోమవారం అనపర్తి పోలీసుస్టేషన్‌లో చంద్ర దండు వలంటీర్ ప్రకాష్‌నాయుడు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుకు రక్షణగా చంద్ర దండు పనిచేస్తుందని, నాడు అనపర్తి సభకు వస్తున్న చంద్రబాబును పోలీసులు అడ్డుకుని ఎనిమిది కిలోమీటర్లు నడిపించారన్నారు. అనపర్తిలో జరిగే సభను అడ్డుకోవడమే కాకుండా చంద్రబాబు వద్ద మైక్ లాక్కునే ప్రయత్నం చేసిన పోలీసులను తమ దండు అడ్డుకుందని, ఈ క్రమంలో అప్పటి డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అప్పారావు తమను అడ్డుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారని, గాయాలపాలైన తమను చంద్రబాబు చొరవతో టీడీపీ నేతలు ఆసుపత్రికి తరలించారని నాయుడు అన్నారు. అప్పుడు ఎంఎల్‌సీ నిర్వహించి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు నేటికీ కేసు నమోదు చేయకపోవడంతో ఈ రోజు మరలా ఫిర్యాదు చేసేందుకు వచ్చానని ప్రకాష్‌నాయుడు అన్నారు. పోలీసు అధికారులు ముగ్గురిపైనే కాకుండా తమపై దాడికి పరోక్షంగా కారకుడైన అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

అనకాపల్లి ఎంపీ ప్రత్యేక పూజలు



స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 8: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించిన ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో గంటా విష్ణు పాల్గొన్నారు.

రూ.50,116 విరాళం

అంతర్వేది, జూలై 8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దర్శనం అనంతరం రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మల్లిడి వెంకటహనుమాన్‌సంతోష్‌కుమార్‌రెడ్డి-దేవశ్రీ దంపతులు నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళాన్ని ఆలయ అధికారి కిరణ్‌కు అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.80వేలు

ఆత్రేయపురం, జూలై 8: వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణానికి ద్వారకా తిరుమల మండలం ఆర్.పంగిడిగూడేనికి చెందిన వడ్లపూడి హరిబాబు కుటుంబ సభ్యులు రూ.55,520, యానానికి చెందిన కుడుపూడి లోకేశ్‌సమీర్‌సాయిబాబు కుటుంబ సభ్యులు రూ.25,050 విరాళం సమర్పించారు. సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,80,782 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గార్డుకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గార్డు దుర్గాప్రసాద్

సామర్లకోట, జూలై 8: యశ్వంత్‌పూర్ నుంచి హౌరా వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడడంతో రైలు గార్డు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం తెల్లవారుజామున సామర్లకోట అవుటర్ సిగ్నల్ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. రైలులో తన గార్డు విభాగానికి గల హ్యాండిల్ ఊడిపోవడంతో అది పట్టుకున్న గార్డు పట్టుతప్పి వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సామర్లకోట రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం అచ్చంపేటలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన గార్డును విజయవాడకు చెందిన వై.దుర్గాప్రసాద్‌గా అధికారులు గుర్తించారు. పక్కటెముకలకు, ముఖానికి తీవ్రంగా గాయాలు కావడంతో తీవ్ర రక్త స్రావం అయ్యిందని వైద్యులు తెలిపారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

రాజోలు, జూలై 8: పొన్నమండకు చెందిన లంక కీర్తన అనారోగ్యంతో అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈనేపథ్యంలో గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ కమిటీ సభ్యులు సమకూర్చిన రూ.10వేల నగదును దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ సోమవారం కీర్తన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తెన్నేటి నాగేశ్వరరావు, రాపాక చిన్నా, నల్లి ప్రసాద్, పెదపూడి శ్రీను, ముస్కూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ద్రాక్షారామ: దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రామచంద్రపురం(ద్రాక్షారామ) జూలై 8: రామచంద్రపురం మండలం, పట్టణంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో సోమవారం రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురంలో రాజ్యలక్ష్మీ ఏజెన్సీస్, శ్రీలక్ష్మీగణపతి ఏజెన్సీస్, ప్రసన్నవిఘ్నేశ్వర ట్రేడర్స్, ద్రాక్షారామ మనగ్రోమోర్‌లో ఎరువులు, పురుగుల మందుల షాపులు తనిఖీలు చేశారు. రికార్డులు, గొడౌన్లలో తనిఖీలు జరిపి స్టాకు రిజిష్టరుతో పోల్చి చూశారు. రశీదు పుస్తకాలు, బిల్లులు పరిశీలించారు. లైసెన్సులు, స్టాకు బోర్డులు అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. తనిఖీల్లో పలాస ఏడీఏ ఎల్.వి.మధు, విజిలెన్స్ సీఐ ఎస్.లక్ష్మీజీ, రామచంద్రపురం వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.వి.రంగారావు, మండల వ్యవసాయాధికారి ఎల్.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం శ్రీకాకుళం జిల్లా పలాస సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎల్వీ మధు, విజిలెన్స్ సీఐ లక్ష్మాజీలతో కూడిన బృందం తనిఖీలు చేపట్టారు. ఎరువులు పురుగు మందుల దుకాణాల్లో స్టాక్, లైసెన్సులు, బిల్ బుక్స్, గొడౌన్‌లో స్టాక్‌ను తనిఖీ చేశారు. ఒక దుకాణంలో రికార్డుకు, స్టాక్ సక్రమంగా లేకపోవడంతో రూ.60వేలకు సంబంధించిన రెండు టన్నుల పొటాష్, ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. ఈతనిఖీల్లో కె.సునిత తదితరులు పాల్గొన్నారు.

కైలాసభూమిని అందుబాటులోకి తీసుకువస్తా



కైలాసభూమి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూలై 8: కొత్తపేటలో కైలాస భూమి నిర్మాణం వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తాను చిత్తశుద్ధితో కృషిచేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సామాజికవేత్త నంబూరి రెడ్డియ్య సారధ్యంలో నిర్మాణవుతున్న కైలాసభూమి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. విద్యుత్, రోడ్లు, మంచినీటి సౌకర్యాల కల్పనకు అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ అధికారులు జంగిల్ క్లియరన్స్ పనులనుపూర్తిచేయాలన్నారు. కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, బూసి జయలక్ష్మీభాస్కరరావు, సలాది రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్, గుబ్బల మూర్తి, సలాది చిన్ని, బండారు వీరబాబు, చోడపనీడి భాస్కరరావు, అద్దంకి చంటిబాబు, పెనుమల్ల అన్నవరం, మిద్దే ఆదినారాయణ, ముద్రగడ సుబ్బారావు, అన్యం మునేశ్వరరావు, బొరుసు సత్తిబాబు, చోడపనీడి గోవిందు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో కంటి పరీక్షలు

రాయవరం, జూలై 8: రాయవరం భాష్యం స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాయవరం ప్రజిత్ కంటి వైద్యశాల ఆప్తొ మాల జిస్టు ఎన్.వెంకటలక్ష్మి 530మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారని ప్రిన్సిపాల్ పట్నాల శ్రీని వాస్ గుప్తా తెలిపారు. ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, అధ్యాపకుడు ద్వారంపూడి చిన్నబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నాడు మాట్లాడలేదు.. నేడు తీర్మానాలా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 8: వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల ఏర్పాటు సందర్భంగా రామచంద్రపురం మండలాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలన్న డిమాండ్‌పై ముందుకురాని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇప్పుడు రామచంద్రపురం మండలాన్ని కాకినాడలో విలీనం చేయాలని తీర్మానం చేయడం హాస్యాస్పదంగా ఉందని స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన యర్రంశెట్టి రామరాజు కాపు పేర్కొన్నారు. గతంలో తాను, అన్నిరాజకీయపక్షాలు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాలు11రోజులు రిలేనిరాహార దీక్షలుచేస్తే అప్పటి సీఎం జగన్, మంత్రి వేణు ఆదేశాలతో వైసీపీ తరఫున ఎవరూ మాట్లాడలేదన్నారు.

మినీ గూడ్స్ ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి

అమలాపురం రూరల్, జూలై 8: మినీ గూడ్స్ ఆటోలకు పట్టణంలో పార్కింగ్ స్థలం కేటాయించి కార్మికులను ఆదుకోవాలని కోరుతూ శ్రీసుబ్బాలమ్మ తల్లి మినీ గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు కొలిశెట్టి త్రిమూర్తులు, కార్యదర్శి కడలి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పండు, సంయుక్త కార్యదర్శి వై.మురళి, లక్కింశెట్టి నిత్యానందం పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి

అమలాపురం టౌన్, జూలై 8: దివంగత వైఎస్ రాజశేఖరెడ్డి జయంతిని పురస్కరించుకుని వైసీపీ శ్రేణుల ఆధ్వర్యంలో హైస్కూలు సెంటర్లోని వైఎస్ విగ్రహానికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాలలువేసి నివాళులర్పించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అనంతరం పేద మహిళలకు విశ్వరూప్ చీరలు పంపిణీ చేశారు. నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, రెడ్డి సత్యనాగేంద్రమణి, సంసాని బులినాని, పందిరి శ్రీహరి, కుడుపూడి భాగ్యలక్ష్మి, బొంతు గోవిందుశెట్టి, కుడుపూడి భరత్‌భూషణ్, యండమూరి గంగ, ఉండ్రుబాబ్జీ, దంగేటి రుద్ర, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పాల్గొన్నారు. అమలాపురం రూరల్ బండారులంకలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో వైఎస్ జయంతి నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. నాయకులు యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, వడ్డి నాగేశ్వరరావు, షకీల, పులుసుగంటి ప్రకాశరావు, ఈతకోట సోమరాజు, జాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా జరిపారు. ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

రావులపాలెం: స్థానిక ఎంకేఆర్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు జగ్గిరెడ్డి, పార్టీ నేతలు పుష్పమాలలు వేశారు.

యానాం: స్థానిక ద్రాక్షారామ రోడ్డులోని వైఎస్ విగ్రహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్ నివాళులర్పించారు. మల్లాడి ఆధ్వర్యంలో రైతులు, మహిళలు 500మందికి దుస్తులు అందజేసి అన్నాదానం చేశారు.

అల్లవరం: కొమరగిరిపట్నం, కోడూరుపాడు గ్రామాల్లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు వైసీపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీలు ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ గుబ్బల బాబ్జీ, నాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
● ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు బండారు, వేగుళ్ల జోగేశ్వరరావు

ఉచిత ఇసుక విధానంతో పేదల్లో ఆనందం





రావులపాలెం: ఉచిత ఇసుక స్టాకు పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, కపిలేశ్వరపురం: ఉచిత ఇసుక పాయింట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

రావులపాలెం, జూలై 8: వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంతో వారంతా ఆనందపడుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మల్లాయిదొడ్డి వద్ద లక్ష్మీపోలవరం రోడ్డులో ఇసుక ఉచిత స్టాక్ పాయింట్లను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు సొంతింటి కల నెరవేర్చుకునే ఆనందంలో ఉన్నారన్నారు. ప్రజలే నేరుగా స్టాక్ పాయింట్ వద్దకువచ్చి లారీ, ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లవచ్చన్నారు. 43లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు గనుల శాఖాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, తోట స్వామి, బండారు బాబి, ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, మైన్స్ ఏడీ సాయిరామ్‌సింగ్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు శ్రీకారం

కపిలేశ్వరపురం, జూలై 8: కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో ఉన్న స్టాక్‌పాయింట్ల ద్వారా ఉచిత ఇసుకను అందించేందుకు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి లోడింగ్, సీనరేజ్ చార్జీలతో కలిపి టన్నుకు రూ.245 ఆన్‌లైన్‌లో కలెక్టర్ అకౌంట్‌కు చెల్లించాలన్నారు. ఉచిత ఇసుక విధానం పక్కదారి పట్టకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారన్నారు. ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో సి. సుధాసాగర్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీవో కొండలరావు, ఎస్సై ఎ.పరదేశి, కార్యదర్శి శివచక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక రాష్ట్ర ప్రగతికి బాట

కొత్తపేట, జూలై 8: ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం రాష్ట్ర ప్రగతికి బాట అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. సోమవారం వారు ఒక ప్రకటనవిడుదల చేశారు. ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు ఊరట లభించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చినహామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన నెలలోపే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుకపాలసీ జీవో విడుదల చేయడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. గతప్రభుత్వంలో ఇసుక మాఫియా కోట్లు కొల్లగొట్టి సామాన్యుల నడ్డివిరిచిందన్నారు.కొత్తపేటటీడీపీ శ్రేణులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చినహామీని నిలబెట్టుకుందన్నారు. టీడీపీ నాయకులు ధర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, కముజు వెంకటేశ్వరరావు, గుబ్బల మూర్తి, అద్దంకి చంటిబాబు పాల్గొన్నారు.



రెడ్డి అనంతకుమారి

చౌదరికి అభినందనల వెల్లువ



కె.గంగవరం, జూలై 8: జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి (యండగండి చౌదరి)కి అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని టీడీపీ నాయకులు రావిపాటి వెంకట గణేష్ చౌధరి, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, మరివాడ సూరిబాబు, దేవరపల్లి బుల్లి, మాటూరి నాని, శిరెడ్డి సత్తిబాబు, నిడదవోలు సుబ్రహ్మణ్యం, పెంకే వెంకట రామకృష్ణ, తోట వెంకన్న, గన్ని శ్రీనివాసు, మార్ని శ్రీదర్ తదితరులు అభినందనలు తెలిపారు.

దంగేరులో పశుగ్రాస వారోత్సవాలు

కె.గంగవరం, జూలై 8: దంగేరులో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులను పశుగ్రాస క్షేత్రాలకు తీసుకెళ్లి పలు రకాల పశుగ్రాసాల గురించి వివరించారు. ఏ నెలలో ఏ పశుగ్రాసం పెట్టాలో తెలిపారు. టీడీపీ నాయకుడు రాయపాటి సుబ్బరాయప్రసాద్, స్థానిక పశువైద్యశాలసిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలి

రావులపాలెం,జూలై8: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలని ఎంఈవోలు శ్రీనివాసరాజు, క్రిష్టోఫర్ కోరారు. స్థానిక నారాయణ పాఠశాలలో ఏజీఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అప్పారెడ్డి, వెంకటరెడ్డి, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్తనఝురి పురస్కారం అందుకున్న ఐశ్వర్య

అమలాపురంటౌన్, జూలై8: కాకినాడసూర్య కళామందిరంలో జరిగిన శ్రీనర్మదేశ్వర నృత్యోత్సవంలో అమలాపురం శ్రీకళాక్షేత్రం విద్యార్థిని తురగా భానుశ్రీ ఐశ్వర్య నృత్యంతో ఆకట్టుకుంది. నర్తనఝురి పురస్కారాన్ని అందుకుంది. శ్రీకళాక్షేత్రం డైరెక్టర్ పి.కామేశ్వరిదేవి, నృత్యగురువు పి.దుర్గారావుఅభినందించారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించండి

అంబాజీపేట,జూలై8: అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించేలాచర్యలు తీసుకోవాలని ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలను కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి కోరారు. అంబాజీపేటలో జరిగిన కార్యక్రమంలోవినతిపత్రం అందించారు.

ఇసుక చోరీ కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి: కలెక్టర్



కపిలేశ్వరపురం స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కపిలేశ్వరపురం, జూలై 8: కపిలేశ్వరపురం స్టాక్‌పాయింట్ నుంచి ఉచిత ఇసుక చోరీకి గురికాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కోరుమిల్లి గ్రామశివారు బలహీనంగా ఉన్న ఏటిగట్టును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంత కాలం నుంచి ఏటిగట్టు బలహీనంగా ఉంది, ఏటిగట్టు పటిష్టతకు చేపట్టిన చర్యలపై ఆయన ఆరా తీశారు. ఉచిత ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక చోరీకి గురికాకుండా గేట్లు, లైట్లు, సీసీ కెమెరాలతో రేయింబవళ్లు నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.సుధాసాగర్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, మైన్స్ ఏడీ సాయిరాం, ఎంపీడీవో కొండలరావు, కార్యదర్శి కె. శివచక్రవర్తి, ఇరిగేషన్, రెవెన్యూ, సచివాలయ, అధికారులు పాల్గొన్నారు.

ఏటిగట్టు పరిశీలించిన కలెక్టర్

కె.గంగవరం, జూలై8: బలహీన ఏటిగట్టు పటిష్టతకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన సుందరపల్లి, కూళ్ల వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. వరదల సమయంలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలనిఇరిగేషన్, రెవెన్యూ అధికారు లకు పలు సూచనలు చేశారు. రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, తహసీల్దార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై8: కార్పొరేట్, ప్రైవేటువిద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని వివరించారు. అర్హతలేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నారని, ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నాయకులు నవీన్ పాల్గొన్నారు.


విద్యార్థుల చదువుకు చేయూత

రావులపాలెం, జూలై 8: చదువుకోవాలనే ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేని పలువురు విద్యార్థులకు రావులపాలెంలోని పులవర్తి ఎడ్యుకేషన్ ట్రస్టు చేయూత అందించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గెడ్డం జెస్సీకకు రూ.25వేలు, బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోన్న బూర్ల శ్రీరామ్‌కుమార్, అంకాలి అచ్యుషకు ల్యాప్‌ట్యాప్‌లను ట్రస్టు అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి-సామ్రాజ్యం దంపతులు అందజేశారు.

శ్రమశక్తి అవార్డులను పునరుద్ధరించాలి

అమలాపురం టౌన్, జూలై 8: ఏటా కార్మికులకు అందించే శ్రమశక్తి అవార్డులను పునరుద్ధరించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సోమవారం ఐఎన్‌టీయూసీ ఉభయ రాష్ట్రాల ఆర్గనైజింగ్ కార్యదర్శి గుత్తుల వెంకటరాధాకృష్ణ వినతిపత్రం అందించారు. సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఉత్తమ కార్మికులకు గౌరవంగా అందించే శ్రమశక్తి అవార్డులను పునరుద్ధరించాలని కోరారు.

నవగ్రహ దీక్ష పొడిగింపు: బోనం



బోనం నాగేశ్వరరావు

రాజోలు, జూలై 8: సీఎం చంద్రబాబు పరిపాలన సజావుగా, ఆదర్శప్రాయంగా ముందుకు కొనసాగాలని కాంక్షిస్తూ 63రోజుల దీక్షను 90రోజులకు పొగించినట్టు హార్టీకల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా తాటిపాకలో ఆయన స్వగృహం వద్ద సోమవరం మాట్లాడుతూ గతంలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆటంకాలు రాకుండా సాగాలని హనుమాన్ దీక్షచేశానన్నారు. 108రోజున, 2016 రోజున, పాదయాత్ర ముగింపు రోజున మూడు సార్లు 108కొబ్బరికాయలు కొట్టి లక్ష తమలపాకుల పూజ, హోమాలు నిర్వహించి అన్నసమారాధన చేశానని బోనం పేర్కొన్నారు.

లక్ష్మీనారాయణకు అభినందనలు


అమలాపురం టౌన్, జూలై 8: కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన దేశంశెట్టి లక్ష్మీనారాయణకు సోమవారం ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, ఆయా సంఘాలసభ్యులు చింతలపూడి సత్తిబాబు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వంటెద్దు బాబు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, వలవల శివరావు, రాయుడు నాని, అనుపోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలయోగికి నివాళి



అమలాపురం టౌన్, జూలై 8: లోక్‌సభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా అమలాపురం పట్టణానికి విచ్చేసిన గంటి హరీష్‌మాధుర్ సోమవారం నల్లవంతెన దిగువన ఉన్న లోక్‌సభ దివంగత స్పీకర్, తండ్రి జీఎంసీ బాలయోగి ఘాట్‌కు చేరుకున్నారు. బాలయోగి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు. నాయకులు చిట్టూరి శ్రీనివాస్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సయ్యపరాజు రామకృష్ణంరాజు, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కును ఆర్ఏ మునిస్వామి అందజేస్తున్న మల్లాడి

యానాం, జూలై 8: 2023 మే14న కోరంగి అపెక్స్ కంపెనీలో పని ముగించుకుని ఆటోలో తిరిగివస్తున్న రొయ్య ఒలుపు కార్మికులను తాళ్లరేవు బైపాస్ వద్ద ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో యానానికి చెందిన 8మంది మృతిచెందగా, ఒకమహిళ ఇప్పటికీ అపస్మారకస్థితిలో ఉంది. ఐదుగురు గాయపడ్డారు. గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించగా మల్లాడిచొరవతో పరిహారం ఒక్కొక్కరికిరూ.2లక్షలు చొప్పున, గాయపడ్డ వారికి వారికి రూ.50వేలు చొప్పున సీఎం సహయనిధినుంచి సీఎం రంగసామి రూ.20.50లక్షలు మంజూరుచేసిన విషయం విదితమే. సీఎం ఇచ్చిన రూ.20.50లక్షల చెక్కులను ప్రభుత్వ ఢిల్లీప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు సోమవారం బాధితుల సమక్షంలో పరిపాలనాధికారి మునిస్వామికి అందజేశారు. ఆర్ఏ కార్యాలయం నుంచి బాధితులఖాతాలకు నగదు జమకానుంది.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్లకు సన్మానం

మండపేట జూలై8: స్థానిక బాబుఅండ్‌బాబు కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి మండపేట రెడ్డి వెంకాయ్యమ్మకమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో మండపేట నియోజకవర్గం నుంచి నాల్గవసారి విజయం సాధించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సన్మానించారు. ఈసభ ఉమ్మడి జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు చుండ్రు గోవిందరాజు అధ్యక్షతన జరిగింది.

సర్పంచ్‌ల సమాఖ్య మండల కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం, జూలై8: సర్పంచ్‌ల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షురాలుగా వైవీపాలెం సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి, ఉపాధ్యక్షులుగా కుంపట్ల నాగలక్ష్మి (కె.ముంజవరం), వడలి కొండయ్య (పోతవరం), కార్యదర్శిగా యల్లమిల్లి కృష్ణవేణి (నాగుల్లంక)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినంధనలు తెలిపి అధ్యక్షురాలు త్రివేణిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, పత్తిపాటి ఉమామహేశ్వరి, నూకపెయ్యి ప్రసన్నకుమార్, పసలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



పి.గన్నవరం, జూలై 8: కలెక్టర్ రావిరాల మహేశ్ కుమార్‌ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలెక్టరేట్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించడంతో పాటు అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట శిరిడీనీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యడ్ల ఏసుబాస్కరావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతి

మలికిపురం, జూలై 8: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను సోమవారం రాజోలు నియోజకవర్గం అన్ని విభాగాల సమగ్ర శిక్షా ఉద్యోగులు కలిసి అభినందించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం చేయాలని కోరారు. మే, జూన్ జీతాలు నేటికీ జమ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. డిసెంబరు 2023లో చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కాలం జీతాలు చెల్లించాలని కోరారు.వినతిపత్రం అందించిన వారిలో రాజేంద్రప్రసాద్, భైరవమూర్తి, గౌరీపార్వతి, పుష్పలత, నాగేశ్వరరావు ఉన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ఆనందరావు



మంత్రి నిమ్మల రామానాయుడుతో

అమలాపురం టౌన్, జూలై8: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవిల్లిలోని ఆయన స్వగృహంలో సోమవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను సచివాలయంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. నాయకులు అధికారి బాబ్జీ, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, కర్రి రామస్వామి, పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.


చింతలూరు నుంచి అన్నవరానికి పాదయాత్ర

ఆలమూరు, జూలై 8: కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ఘన విజయం సాధించడంతో టీడీపీ నాయకుడు చింతలూరు ఫణికుమార్ సోమవారం మొక్కు తీర్చు కోవడానికి అన్నవరం పాదయాత్రగా వెళ్లి సత్యదేవుడిని దర్శించుకున్నారు. తొలుత చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. టీడీపీ గ్రామఅధ్యక్షుడు వైట్ల గంగరాజు, మాజీ సర్పంచ్ వాకా సుబ్బలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఫణికుమార్ బృందాన్ని సత్కరించి పాదయాత్ర ప్రారంభించారు.

పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్న మూర్తి

అమలాపురం టౌన్, జూలై 8: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అమలాపురానికి చెందిన కల్వకొలను వెంకటరమణమూర్తి (ఐడియా మూర్తి) కాకినాడ సమీపంలోని రేపూరు సాయిబాబా ఆలయానికి పాదయాత్రగా వెళ్తానని మొక్కుకున్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం ఎదుట ఉన్న షిర్డిసాయి ఆలయం వద్ద నుంచి సోమవారం పాదయాత్ర చేపట్టారు. ముక్తేశ్వరం, కోటిపల్లి, ద్రాక్షారామ, గొల్లపాలెం మీదుగా రేపూరు సాయిబాబా ఆలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నట్టుమూర్తి తెలిపారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు మృతి



అమలాపురం రూరల్, జూలై 8: రంగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు(70) కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1992 నుంచి 95 వరకు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి కృషి చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మాజీ మంత్రి వేణుకు విశ్వరూప్ పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 8: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణను సోమవారం మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. వైసీపీ నాయకులు దవులూరి దొరబాబు, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి పరామర్శించారు.

భర్త వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం, జూలై 8: తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను నిర్లక్ష్యం చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ దొమ్మేటి పాలేనికి చెందిన గౌతమికి అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన మోరంపూడి శ్రీనివాసరావుతో 2021 ఆగస్టు నెలలో వివాహమైంది. కొంతకాలం కాపురం సజావుగా సాగిందని, అయితే తన భర్త ఆఫీసులో పనిచేసే మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను నిర్లక్ష్యం చేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈవిషయాన్ని శ్రీనివాసరావు సెల్‌ఫోన్ ద్వారా గుర్తించి నిలదీయగా తన మామ భూషణం, ఆడపచుడు కుసుమ విజయకుమారిలు అతడికి మద్దతుగా మాట్లాడి తనను దూషించారని, దీనిపై పెద్దల సమక్షంలో తగవు పెట్టగా ఇకపై కాపురం సక్రమంగా చేసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించినా అతని ప్రవర్తనలో ఏవిధమైన మార్పు రాకపోగా తనపై భౌతిక దాడులకు దిగి చంపుతానని బెదిరించడంతో చుట్టుపక్కల వారు తనను పుట్టింటికి పంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. భర్త శ్రీనివాసరావు, అత్త భానుమతి, మామ భూషణం, ఆడపడుచు కుసుమ విజయకుమారినుంచి తనకు రక్షణ కల్పించాలని ఆమె ఫిర్యాదుతో కోరింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సురేష్‌బాబు తెలిపారు.

మంచినీటి ప్రాజెక్టు పనుల నాణ్యత పరిశీలన

అంతర్వేది, జూలై 8: అంతర్వేది దేవస్థానం గ్రామంలో రూ.17.33 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి ప్రాజెక్టును సోమవారం క్వాలిటీ కంట్రోల్ డీఈ అనంతరాజు పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న కాంక్రీట్ వాల్, ఓవర్‌హెడ్ ట్యాంక్, సంపు తదితర నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. రాజీ పడకుండా నాణ్యతా లోపాలు లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. తీర ప్రాంత గ్రామాలకు ఈతాగునీటి ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజన్, ఏఈఈ శిరీష, ఏఈవో పోశమ్మ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 8: స్థానిక గొల్లపుంతకాలనీలో రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని వేగుళ్ల అభినందించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.సూర్య ప్రకాష్, టి.వి.రమణ, ఐ.ప్రసాద్, మల్లేశ్వరరావు, లంక పవన్‌తేజ, గండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ చొరవతో పూడికతీత పనులు

ఆత్రేయపురం, జూలై 8: నార్కెడుమిల్లిలో మురుగునీరు వెళ్లే మార్గం లేక ఇళ్లలోకి చేరిపోతోంది. ప్రధాన డ్రైనేజీ పూడిక తీయకపోవడంతో దుర్గంధం వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ, బీసీ ఏరియాల్లో మురుగునీరు ఇళ్లల్లోకి వెళ్తోంది. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈదుస్థితి నెలకొంది. ఈఅంశాన్ని స్థానికులు మాజీ సర్పంచ్, ఎన్డీఏ కూటమి నేత మద్దింశెట్టి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారంఆయన స్పందించి సొంతఖర్చుతో ఎక్స్‌కవేటరుతో పూడికతీయించి సమస్యనుపరిష్కరించారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ

అమలాపురం రూరల్, జూలై 8: జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పి.రాము ఆధ్వర్యంలో ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టాప్ డయేరియాపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డయేరియా వ్యాధిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రూ.10లక్షల బీమా చెక్కు అందజేత

మండపేట, జూలై 8: పోస్టల్ శాఖ అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు అన్నారు. స్థానిక దుకాణంలో పనిచేసిన మండపేటకు చెందిన యువకుడు వారం రోజులు క్రితం రూ.359తో ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకున్నాడు. అయితే ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో నామీనిగా ఆడపా లక్ష్మీకి రూ.10లక్షల బీమా చెక్కును శేషారావు అందజేశారు. బాధిత కుటుంబానికి పోస్టల్ శాఖ బాసటగా నిలిచిందని మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాస్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.కామేశ్వరరావు, రాజేంద్ర నాయుడు, అర్జున్, కె.వి.నారాయణరావు, కొండపల్లి సూర్యనా రాయణ, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అమలాపురం టౌన్, జూలై 8: సామర్లకోట రాక్ సిరామిక్స్ కంపెనీలో పర్మినెంట్ వర్కర్లుగా పనిచేస్తున్న 24మంది కార్మికులకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈఏడాది ఏప్రిల్ 14నుంచి విధుల నుంచి తొలగించడంపై సోమవారం కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) లేఖ రాశారు. దీనిపై ఇప్పటికే జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశామని, యాజమాన్యం లెక్కచేయడం లేదని లేఖలో పేర్కొన్నారు. 18ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తొలగించిన 24మందినివిధుల్లోకి తీసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్ర్కీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ